
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
ఆదివారం 12 అక్టోబరు 2025



ఒకరినొకరు అర్థం చేసుకోవాలి



భార్యభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకోవాలి. ఏదైనా సమస్య వస్తే ఇద్దరూ కలిసి చర్చించుకుని పరిష్కరించుకోవాలి. అన్ని విషయాలు మాట్లాడుకోవాలి. మన సంపాదన ఎంత, ఖర్చు ఎంత పెట్టాలి, పొదుపు ఎంత చేయాలనేది భార్య చేతల్లో ఉంది. ఎదుటి వారితో మనం పోల్చుకోకూడదు. మన ఆర్థిక పరిస్థితి బట్టి మనం నడుచుకోవాలి. ఇక భర్తలు తాగుడు, బెట్టింగ్, వివాహేతర సంబంధాల జోలికి పోకూడదు. భార్యభర్తలు గొడవలు పడితే ఆ ప్రభావం పిల్లలపై పడుతుంది. కనుక చిన్న చిన్న విషయాలకు గొడవలు పడకూడదు.

- బాలస్వామిరెడ్డి, డీఎస్పీ, మహిళా పోలీసుస్టేషన్



కౌన్సిలింగ్ చేస్తున్న పోలీసులు

సంసారమనే నావను దరికి చేర్చాలన్నా.. కుటుంబం అనే బండిని సజావుగా ముందుకు నడపాలన్నా భార్యాభర్తల మధ్య సఖ్యత ముఖ్యం. పిల్లల భవిష్యత్తుకు కూడా ఇది కీలకం. వివాహ బంధంలో దంపతుల మధ్య పరస్పర ప్రేమానురాగాలు ఉంటే కాపురం చిలకపచ్చ కాపురంగా ఉంటుంది. సంసార జీవితం సజావుగా సాగుతుంది. అయితే అనుమానాలు, ఒకరిపై ఒకరికి ఇగోలు, నేనే గొప్ప అంటూ పౌరుషాలకు పంతాలకు పోతే పచ్చని సంసారాల్లో పొరపొచ్చాలు తప్పవని పెద్దలు అనుభవ పూర్వకంగా చెబుతున్నారు.

పచ్చని సంసారంలో...
చిటపటలు

- చిన్న చిన్న విషయాలకే గొడవలు
- నేనంటే.. నేను గొప్ప అంటూ ఇగోలు
- ఒకరిపై ఒకరికి అపనమ్మకం.. అనుమానం
- పోలీసుస్టేషన్ల మెట్లెక్కుతున్న భార్యాభర్తలు
- సర్దుకుపోతేనే.. సాఫీగా జీవితం
- కౌన్సెలింగ్‌తో కలుసుకుంటున్న జంటలు

(కడప - ఆంధ్రజ్యోతి):

● కడపకు చెందిన శివకుమార్ (పేరుమార్చాం)కు ఎనిమిదేళ్ల క్రితం పెళ్లయింది. భార్య భర్తలు కష్టపడి కుటుంబాన్ని పోషించుకునేవారు. శివకుమార్ ఓ ప్రైవేటు కంపెనీలో జాబ్ చేస్తుండగా, ఆమె ఇతర ప్రాంతాల్లో పనిచేస్తుండేది. అయితే ఇరువురి మధ్య సంపాదన వద్ద మనస్పర్థలు వచ్చాయి. దీనికి తోడు ఒకరిపై ఒకరికి అపనమ్మకం కలిగి వాదులాడుకున్నారు. చివరికి పోలీసుస్టేషనుకు రావడంతో ఇరువురికి మూడుసార్లు కౌన్సెలింగ్ ఇచ్చి కలిసిపోయేలా చేశారు.

● కడప పట్టణంలోని రవీంద్రనగర్‌కు చెందిన సింగ్ (పేరుమార్చాం)కు ఆరేళ్ల క్రితం పెళ్లయింది. ఇరువురు పిల్లలు. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుండేవారు. అయితే మద్యానికి బానిసై భార్యపై అనుమానం పెంచుకున్నాడు. భార్య ఎవరితోనో ఎక్కువ ఫోనులో మాట్లాడుతుందని అనుమానించి గొడవ పడేవాడు. పలు మార్లు కుటుంబీకులు సర్ధి చెప్పినా సెట్ కాలేదు. చివరికి పోలీసుస్టేషన్‌కు పంచాయతీ చేరింది.

● పెండ్లిమర్రి మండలానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి (పేరుమార్చాం) ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తుంటాడు. రెండేళ్లక్రితమే పెళ్లయింది. అయితే అతని భార్య గొర్రెబెత్తడు జీతంతో కుటుంబం నడపాలంటే కష్టం, మా బంధువులు, నా క్లాస్‌మేట్స్ హై పొజిషన్‌లో ఉన్నారు. వాళ్ల మెయింటెనెన్స్ ఖర్చుకు కూడా సరిపోదని, నిన్ను అనవసరంగా పెళ్లి చేసుకున్నా, నాకు డైవోర్స్ ఇవ్వాలంటూ భర్తతో గొడవకు దిగేది. భర్తపై కేసు కూడా పెట్టింది. కౌన్సెలింగ్‌తో ఇరువురిని కలిపారు.



నేటి హైటెక్ సొసైటీలో చిన్న చిన్న విషయాలకే భార్యభర్తలు ఇగోకు పోతున్నారు. నా మాటే చెల్లుబాటు కావాలి... నేను లేకపోతే ఇల్లు నడవదు... నా కష్టంతోనే కుటుంబం గడుస్తుంది... అని భార్యాభర్తలు ఎవరికి వారు అహానికి పోతున్నారు. ఏదో మనసులో పెట్టుకుని సూటి పోటి మాటలు మాట్లాడుకోవడం పచ్చని కుటుంబాల్లో చిచ్చులు చెలరేగడానికి కారణమవుతున్నాయి. ఇక ఉమ్మడి కుటుంబాలు కరువు కావడం, సోషల్ మీడియా ఎఫెక్ట్, పొరుగు వారి మాదిరిగా కాస్లీ లైఫ్ ఉండాలంటూ ఇగోలకు పోయి భార్యాభర్తలు గొడవలు పడుతున్నారు. ఇక పెళ్లియిన తొలినాళ్లలో ఇరువురూ అన్ని విషయాలు షేర్ చేసుకుంటుం టారు. అయితే రాను రాను ఇది తగ్గిస్తారు. దీంతో ఒకరిపై ఒకరికి అపనమ్మకం, అనుమానాలు తలెత్తడం, వివాహేతర సంబంధాలకు దారితీయడం. చివరకు గొడవలు పడి పోలీసుస్టేషన్ల మెట్లు ఎక్కడం, కేసులు పెట్టుకొని కోర్టులకు వెళ్లడం పరిపాటిగా మారింది.

జిల్లా వ్యాప్తంగా ఇలా చిన్నపాటి గొడవలు, మనస్పర్థలతో భార్యభర్తలు ఇటీవల పెద్దసంఖ్యలో పోలీసుస్టేషన్లకు చేరుతున్నారు. దీంతో ప్రతి సోమవారం ఎస్పీ నిర్వహించే ప్రజాఫిర్యాదుల వేదిక, ఆయా పోలీసుస్టేషన్లలో ఫిర్యాదులు, మహిళా పోలీసుస్టేషన్లలో కేసులు నమోదువుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు సుమారు 729 ఫిర్యాదులు పోలీసుస్టేషన్లకు అందాయి. వీటన్నింటినీ చాలావరకు పరిశీలిస్తే.. అనుమానం, మద్యం, అదనపు కట్నం, ఇగోల కారణంగానే గొడవలు పడి స్టేషన్ల మెట్లు ఎక్కుతున్నారు.



మహిళా పోలీసుస్టేషన్‌లో కౌన్సిలింగ్ చేస్తున్న పోలీసులు

కౌన్సెలింగ్‌తో కలిసిపోతున్నారు

కడప మహిళా పోలీసుస్టేషన్‌లో పరిశీలిస్తే 729 ఫిర్యాదులు వచ్చాయి. అయితే ఇక్కడ కౌన్సెలింగ్‌తో చాలా జంటలు మళ్లీ తిరిగి కలుసుకుంటున్నారు. సైక్రియాటిస్ట్, అడ్వకేట్, ఇతర పోలీసులు భార్యాభర్తలకు ప్రతి మంగళ, శనివారాల్లో కౌన్సెలింగ్ చేస్తారు. సైక్రియాటిస్ట్ మెంటల్ కండీషన్ అంచనా వేసి అంత ఈజీగా కలవకపోతే, వారిలో కోపం తగ్గేందుకు కౌన్సెలింగ్‌ను వాయిదా వేసుకుంటూ వస్తారు. ఇప్పటి వరకు 510 జంటలు కలిసిపోయాయి.

SUNDAY SPECIAL

'పాపాఘ్ని'కి జలకళ



గండి క్షేత్రం సమీపంలో ప్రవహిస్తున్న పాపాఘ్ని నీరు

చక్రాయపేట/వేంపల్లె, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పాపాఘ్నికి జలకళ వచ్చింది. గత రెండు రోజులుగా పైతట్టు ప్రాంతంలో కురుస్తున్న నదిలో నీళ్లు ప్రవహిస్తున్నాయి. రెండేళ్లుగా పాపాఘ్నిలో నీటి ప్రవాహం లేక భూగర్భజలాలు అడుగంటి పోయి.. నదీ తీర ప్రాంత వాసులకు సాగు, తాగు నీటి సమస్య ఏర్పడింది. ఈ తరుణంలో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు నదిలో నీళ్లు ప్రవహించడంతో తీరప్రాంత ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గాలివీడులో కుండపోత

- అత్యధికంగా 108.4 మి.మీ వర్షపాతం నమోదు
- పెరిగిన వెలిగల్లు జలాశయం నీటిమట్టం



వెలిగల్లు జలాశయంలో పెరిగిన నీటిమట్టం

గాలివీడు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వరుణుడి ఉగ్రరూపంతో గాలివీడులో కుండపోత వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి ఏకధాటిగా కురిసిన వర్షానికి 108.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో శ్రీదుర్గ తెలిపారు. భారీ వర్షం కారణంగా చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ప్రవాహంతో వెలిగల్లు జలాశయంలో 3.110 టీఎంసీలకు చేరింది. దాదాపు 1 టీఎంసీ నీటిమట్టం పెరిగిందని జలాశయ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 4.64 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.027 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈ శిరీష్‌కుమార్ తెలిపారు. మండలంలో కురిసిన వర్షానికి గోరాన్‌చెరువు నుంచి వడిసెలవంక వద్ద వంక ప్రవాహం పెరగడంతో పెద్దచెరువులో 40 శాతం నీరు వచ్చి చేరింది. ఎల్లంపల్లి, కుషావతి రిజర్వాయర్ నుంచి నడింపల్లి మీదుగా వస్తున్న ప్రవాహంతో చిన్నేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇంకా గ్రామాల్లోని చెరువులు, కుంటలు, వాగులు జలకళను సంతరించుకున్నాయి.

'పుట్టి' మునిగింది..!
● దళారులు చెప్పిందే ధర ● నష్టపోతున్న రైతులు
7



స్టాప్.. వాష్ అండ్ గో..

కడప క్రైం, అక్టోబర్ 11(ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని వైఎస్ఆర్ సర్కిల్ వద్ద స్టాప్, వాష్ అండ్ గో కార్యక్రమాన్ని నిర్వ హించారు. కార్లు, లారీలు, బస్సులు, వ్యాన్లు తదితర వాహనాల డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపారు. జాతీయ రహ దారులపై స్టాప్, వాష్ అండ్ గో కార్యక్రమం నిర్వహించాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు శనివారం నగరంలోని చెన్నై-కర్నూలు నేషనల్ హైవేపై వైఎస్ఆర్ సర్కిల్ వద్ద అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ రహదారిపై వెళుతున్న కార్లు, లారీలు. బస్సులు, వ్యాన్లు తదితర వాహనాలను ఆపి డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపించారు. నిద్ర మత్తు నుంచి తేరుకునేలా పేష్ వాష్‌తో పాటు కొంచెం టీ కూడా తాగమని పోలీసులు సూచించారు.



డ్రైవరుకు నీళ్లు అందిస్తున్న కడప ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు

చిరు వ్యాపారులకు భరోసా

పీఎం స్వానిధి ద్వారా వీధి వ్యాపారులకు రుణం

- 52,656 మంది గుర్తింపు
- రూ.79.6 కోట్లు పంపిణీ
- 2030 వరకు పథకం గడువు పెంపు

కడప ఎన్టీఆర్ సర్కిల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ సమయంలో ప్రారంభించిన పీఎం స్ట్రీట్ వెండర్స్ ఆత్మనిర్భర్ నిధి యోజన చిరు వ్యాపారుల ఆర్థిక ఇబ్బందులు తొలగించేందుకు ఎంతో ఉపయోగపడింది. మెప్మా ఆధ్వర్యంలో వీధి వ్యాపారులకు తొలి విడత రూ.10వేలు, రెండో విడతలో రూ.15వేలు, మూడో దఫా రూ.30వేల చొప్పున రుణాలు అందజేశారు. దీంతో కరోనా సమయంలో వారు పెట్టుబడికోసం అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన బాధను తప్పించడానికి ఈ సాయం ఎంతగానో ఉపయోగపడింది.

జిల్లాలో ప్రతి పట్టణంలో దాదాపు 2వేల నుంచి 3వేల మందికి పైగా చిరు వ్యాపారులు వివిధ రకాల వ్యాపారాలు చేస్తూ జీవిస్తున్నారు. వీరంతా తోపుడు బండ్లు, రహదారి పక్కన తాత్కాలిక దుకాణాల్లో వ్యాపారలు చేస్తుంటారు. ఇలాంటి వారికి చేయూతనిచ్చి మెరుగైన జీవనోపాధి అందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ఈ మేరకు ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నాయి. పట్టణాలు, నగర పంచాయతీలు పరిధిలో చిరు వ్యాపారం చేస్తున్న వారిని గుర్తించి వారికి కార్డు లు జారీ చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుంది.

జిల్లాలో 52,656 మందిని అర్హులుగా గుర్తించారు. ఇందులో బద్వేలు పట్టణ ప్రాంతంలో 4851 మంది, జమ్మలమడుగు పట్టణంలో 2092, కడప నగరంలో 28,740, మైదుకూరు 3283, ప్రొద్దుటూరు 7373, పులివెందుల 4463, ఎర్రగుంట్ల పట్టణంలో 1894 మందిని గుర్తించారు. అలా గుర్తించిన వారికి కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అందిస్తారు. ఈ ఏడాది సెప్టెంబరు 22 వరకు బద్వేలు పట్టణంలో రూ.5.91 కోట్లు, జమ్మలమడుగు 2.93 కోట్లు, కడప నగరంలో 44.89 కోట్లు, మైదుకూరు 5.14 కోట్లు, ప్రొద్దుటూరు 10.31 కోట్లు, పులివెందుల రూ.7.5 కోట్లు, ఎర్రగుంట్ల పట్టణంలో 2.91 కోట్ల రూపాయలు, జిల్లా మొత్తంగా రూ.79.6 కోట్ల మేర కేంద్ర సాయాన్ని చిరు వ్యాపారులకు అందజేసింది.



తోపుడుబండ్లపై వీధి వ్యాపారాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆదేశాలు రాగానే..

ప్రభుత్వం నుంచి ఆదేశాలు, మార్గ దర్శకాలు రాగానే పెట్టుబడి అవసరమైన వీధి వ్యాపారులను ఆర్పీల ద్వారా గుర్తించే ప్రక్రియ ప్రారంభమవుతుంది.

- కిరణ్‌కుమార్, పీడీ, మెప్మా

పీఎం స్వానిధి గడువు పెంపు

కొవిడ్‌లో ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి స్వానిధి పథకం గడువు గత ఏడాది డిసెంబరు నాటికి ముగిసిపోయింది. దీన్ని ఇప్పుడు 2030 వరకు పొడిగించారు. అదే విధంగా తొలి విడతగా ఇచ్చే రుణాన్ని ప్రస్తుతం రూ.15వేలకు, రెండో విడత రుణం రూ.30వేల వరకు ఇవ్వనున్నారు. 2020 జూన్ నుంచి ప్రవేశపెట్టిన ఈ పథకానికి సంబంధించి జిల్లాలో పంపిణీ చేసిన వివరాలిలా..

● బద్వేలు పట్టణంలో మొదటి విడతలో 2775 మందిని గుర్తించగా 2748 మందికి రూ.2.75 కోట్లు రుణాలు అందించారు. రెండో విడత కింద 1584 మందికి 974 మందికి రూ.కోటి 95 లక్షల రుణం ఇచ్చారు. మూడో విడత కింద 492 మందికి 242 మందికి రూ.కోటి 21 లక్షలు రుణాలు అందించారు.

● జమ్మలమడుగు నియోజకవర్గంలో మొదటి విడత కింద 1181 మందికి రుణాలు అందించాల్సి ఉండగా 1091 మందికి రూ.కోటి 9 లక్షలు రుణమిచ్చారు. రెండో విడత కింద 704 మందికి 609 మందికి రూ.1.22 కోట్లు, మూడో విడత కింద 207 మందికి 124 మందికి రూ.62లక్షలు రుణమిచ్చారు.

● కడప నగరంలో మొదటి విడత కింద 15578 మందికి 15487 మందికి రూ.15.48 కోట్లు, రెండో విడత కింద 9394 మందికి 7774 మందికి రూ.15.52 కోట్లు, మూడో విడత కింద రూ.13.89 కోట్లు రుణం అందించారు.

● మైదుకూరు పట్టణంలో మొదటి విడత కింద 1951 మందికి 1938 మందికి రూ.కోటి 94 లక్షలు రుణమిచ్చారు. రెండో విడత కింద 898 మందికి గాను 716 మందికి రూ.కోటి 42 లక్షలు, మూడో విడత కింద 434 మందికి 356 మందికి రూ.కోటి 78 లక్షలు రుణాలు ఇచ్చారు.

● ప్రొద్దుటూరు పట్టణంలో మొదటి విడతగా 4498 మందికి గాను 4359 మందికి 4.35 కోట్ల రూపాయలు రుణమిచ్చారు. రెండో విడత కింద 245 మందికి 1884 మందికి రూ.3.77 కోట్లు, మూడో విడత కింద 690 మందికి గాను 450 మందికి 2.19 కోట్ల రూపాయలు రుణం ఇచ్చారు.

● పులివెందుల పట్టణ ప్రాంతంలో మొదటి విడత కింద 2376 మందికి గాను 2376 మందికి 2.37 కోట్లు, రెండో విడత కింద 1460 మందికి గాను 1346 మందికి 2.69 కోట్లు, మూడో విడత కింద 627 మందికి గాను 558 మందికి 2.45 కోట్ల రూపాయలు రుణాలు అందజేశారు.

● ఎర్రగుంట్ల పట్టణ పరిధిలో 1102 మందికి రుణం ఇవ్వాల్సి ఉండగా 1091 మందికి రూ.1.09 కోట్లను అందించారు. రెండో విడత కింద 590 మందికి 488 మందికి రూ.98 లక్షలు, మూడోవిడత కింద 202 మందికి 169 మందికి రూ.84 లక్షల మేర రుణాలు అందజేసిన పరిస్థితి. ప్రస్తుతం పథకం గడువు పొడిగించడమే కాకుండా రుణాన్ని కూడా 50శాతం మేర పెంపుదల చేయడంతో చిరు వ్యాపారులకు పెద్ద ప్రయోజనం కలిగే అవకాశం లేకపోలేదు.

28న మఠాధిపతి నియామకం కోసం సమావేశం

బ్రహ్మంగారిమఠం, అక్టోబర్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం బ్రహ్మంగారిమఠం మఠాధిపతి నియామకం కోసం ఈనెల 28న ఉదయం 11గంటలకు సమావేశం నిర్వహి స్తున్నట్లు దేవదాయ ధర్మదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనరు చంద్రశేఖర్ ఆజాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఏపీ ధార్మిక పరిషత్ నియమించిన అధికారి నేతృత్వంలో మఠం శిష్యులతో సమావేశం ఉంటుందన్నారు. ఆశావహులు హాజరై వారి సందేహాలు, సూచనలు ఆధారాలతో సహ లిఖిత పూర్వకంగా తెలపాలని కోరారు. అనుకోని పరిస్థితుల్లో రాలేకపోయిన వారు కూడా తమ అభిప్రాయాలు పోస్టు ద్వారా రాసి పంపవచ్చని చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు.

వ్యవసాయ ఉత్పత్తులను పెంచడమే లక్ష్యం

● జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్



మాట్లాడుతున్న జేడీఏ చంద్రానాయక్ తదితరులు

సీకేదిన్నె, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ఉత్పత్తులను పెంచడమే ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన లక్ష్యమని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండల వ్యవసాయ పరిశోధన స్థానంలో శనివారం కేవీకే ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన ప్రారంభోత్సవం నిర్వహించి, ఆత్మా నిర్భరత మిషన్ ప్రత్యక్ష వీక్షణ కార్యక్రమాన్ని రైతులతో కలిసి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం కరవు కాటకాలతో తినడానికి తిండిలేక చాలా దుర్భరస్థితిలో ఉండేవారమన్నారు. హరిత విప్లవం ద్వారా ఆహార ధాన్యాల స్వయం సమృద్ధి సాధించడం జరిగిందన్నారు. అయితే పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలలో ఇంకా స్వయం సమృద్ధి సాధించలేకపోతున్నామన్నారు. దీన్ని అధిగమించడానికి ప్రధాని నరేంద్రమోదీ రెండు పథకాలను ప్రారంభించారన్నారు. అందులో దేశవ్యాప్తంగా వంద జిల్లాలు ఎంపిక చేయగా మూడు రాయలసీమ జిల్లాలను ఎంపిక చేశారన్నారు. వేరుశనగ, కంది, కుసుమ, పొద్దుతిరుగుడు వంటి పంటల సాగు విస్తీర్ణం చాలా తగ్గిందని, సాగు విస్తీర్ణాన్ని పెంచడానికి రైతులకు సబ్సిడీ ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగు, కలుపు మందులను అందజేస్తున్నారన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త అంకయ్యకుమార్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన పథకంలో భాగంగా జిల్లాల్లో స్థిరమైన వ్యవసాయ ఉత్పత్తులను అవలంభింపజేయడమే లక్ష్యమన్నారు. ప్రధాన కీటక విభాగం శాస్త్రవేత్త సునీల్‌కుమార్ రైతులకు మినుము, వేరుశనగ, శనగ, పెసర, కంది, నువ్వుల పంటల్లో సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ విజయలక్ష్మి, ఏపీసీ జిల్లా మేనేజర్ సంపత్‌కుమార్, ప్రకృతి వ్యవసాయం పథకం ఉప సంచాలకులు వసంతకుమారి, శాస్త్రవేత్తలు, వివిధ వ్యవసాయ డివిజన్ల సహాయ వ్యవసాయ సంచాలకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పచ్చ.. పచ్చగా...



చెయ్యేరు నది పరీవాహక ప్రాంతంలో విస్తారంగా సాగైన వరి పంట

- 5 వేల ఎకరాల్లో సాగైన వరి పంట
- 20 ఏళ్ల తర్వాత సస్యశ్యామలంగా చెయ్యేరు నది పరీవాహక ప్రాంతం

రాజంపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : చెయ్యేరు నది పరీవాహక ప్రాంతాల్లో పెద్దఎత్తున వరి పంట పండింది. చెయ్యేరు నది ఆధారంగా మూడు మండలాల ప్రజలు సుమారు 20 వేల ఎకరాల్లో పంటలు సాగు చేసేవారు. గతంలో భారీ వర్షాలు కురుస్తుండడం, బోరుబావులు లేకపోవడం, ఎగువ ప్రాంతాల్లో అన్నమయ్య ప్రాజెక్టు ఇతర ప్రాజెక్టులు లేకపోవడం కారణంగా చెయ్యేరునది ఏడాదంతా నీటితో కళకళలాడుతూ ఉండేది. అటువంటి నదికి ఎగువ ప్రాంతాల్లో అన్నమయ్య, పింఛా తదితర అనేక ప్రాజెక్టులు కట్టడం వల్ల వర్షాకాలంలో ప్రాజెక్టులు నిండితే తప్ప దిగువ ప్రాంతాలకు నీరు వచ్చేది కాదు. ప్రధానంగా 20 ఏళ్లుగా వాతావరణ పరిస్థితుల్లో తీవ్ర పరిణామాలు రావడంతో కనీస వర్షపాతం కూడా కురవడం లేదు. దాని వల్ల ఏడాదంతా నదికి నీరు వచ్చే పరిస్థితి లేదు. అడుగడుగునా బోరుబావులు భారీ ఎత్తున వేయడంతో ఏటిలో ఉన్న నీరంతా ఇంకిపోతోంది. ఇత్యాది కారణాల వల్ల గతంలో మూడు పంటలు పండే చెయ్యేరు నది నేడు వెలవెలబోతోంది. అయితే ఈ ఏడాది ఎగువ ప్రాంతాల్లో ఒక మోస్తారు వర్షాలు కురుస్తుండడం, దాంతో పాటు అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడం వల్ల పడే వర్షపు నీరంతా దిగువ ప్రాంతాలైన చెయ్యేరు నది పరీవాహక ప్రాంతాలకు చేరుతోంది. దీనివల్ల రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాల పరిధిలోని సుమారు 100 గ్రామాల ప్రజలు చెయ్యేరు నీటిని ఆధారం ఊట కాలువల ద్వారా వచ్చే నీటితో విస్తారంగా వరి పంటను సాగు చేశారు. ప్రస్తుతం వరి పంట మూడు దశల్లో ఉంది. పులపత్తూరు, మందపల్లె, తొగూరుపేట, రామచంద్రాపురం, గుండ్లూరు, తాళ్లపాక, శేషమాంబపురం, పాపరాజుపల్లె, నారాయణనెల్లూరు, నందలూరు, నాగిరెడ్డిపల్లె, పాటూరు, కుమ్మరపల్లె, ఇసుకపల్లె, మందరం, మందరం రాచపల్లె, లేబాక, టంగుటూరు, పొత్తపి, ఓబిలి, పెనగలూరు ఇలా వందకు పైబడి గ్రామాల రైతులు పుష్కలంగా పంటలు పండిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున చెయ్యేరు నదికి నీరు చేరి పంటలు బాగా పండిస్తున్నారు. ప్రస్తుతం దాదాపు 5 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. ఆ పంట అంతా చేతికొచ్చే పరిస్థితి ఏర్పడింది. ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నందున ఇప్పుడు మరో 5 వేల ఎకరాల పైబడి వరి పంట సాగు చేయడానికి నార్లు కూడా పోశారు. మరికొన్నిచోట్ల నాట్లు కూడా నాటారు. ఇక్కడ వరిలో అన్ని రకాలను సాగు చేస్తున్నారు. అయితే కొత్తగా బాస్మతి వరిని కూడా సాగు చేశారు. తొగూరుపేటకు చెందిన శివరామయ్య తదితర రైతులు బాస్మతి రకం వరిని కిలో రూ.200 పెట్టి సాగు చేశారు. ఈ పంట కూడా పెద్దఎత్తున పండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



తొగూరుపేటలో సాగైన బాస్మతిరకం వరి



వెన్నుకు వచ్చిన బాస్మతి వరి

బాస్మతి రకాన్ని కూడా సాగు చేశాం



చెయ్యేరు నది పరీవాహక ప్రాంతాల్లో ఈ ఏడాది విస్తారంగా వరిపంటను సాగు చేశాం. వరద నీరు భారీఎత్తున వస్తుండడంతో అనేక ఏళ్ల తర్వాత భారీ ఎత్తున వరి పంట సాగు చేశాం. నేను సుమారు ఎకరా పొలంలో కిలో రూ.200 పెట్టి బాస్మతిరకం వరి పంటను సాగు చేశాను. ఈ పంట బాగా పండింది. ఒక్కో వెన్ను జానెడు పొడవు ఉంది. ఎకరాకు కనీసం 50 బస్తాలు వచ్చే అవకాశం ఉంది. కిలో బాస్మతిరకం బియ్యానికి వందల రూపాయల్లో గిట్టుబాటు ధర వచ్చే అవకాశం ఉంది. అందరూ ఈ పంటను సాగు చేయడానికి విత్తనాల కోసం నేను పండించిన బాస్మతిరకం వడ్లను అడుగుతున్నారు.

- శివరామయ్య, రైతు, తొగూరుపేట.

సుదీర్ఘ కాలం తర్వాత విస్తారంగా వరి సాగు



సుదీర్ఘ కాలం తర్వాత చెయ్యేరు నది పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వరి పంటను సాగు చేయడం శుభపరిణామం. 20 ఏళ్లుగా వర్షాలు లేకపోవడం వల్ల పంటల సాగు తగ్గింది. నాలుగేళ్ల కిందట వర్షం పడినా అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడంతో చుక్కనీరు లేకుండా వృధా అయ్యింది. ప్రస్తుతం వర్షాలు బాగా కురుస్తున్నందున చెయ్యేరునది పరివాహక ప్రాంతాలైన మూడు మండలాల్లో వేలాది ఎకరాల్లో వరిపంటను సాగు చేశారు. విస్తారంగా వర్షాలు పడడం, దానికితగ్గట్టు ఎగువ ప్రాంతంలో ప్రాజెక్టు తెగిపోవడం వల్ల వర్షపునీరు దిగువ ప్రాంతాలకు చేరడం వల్ల ఊటకాలువలకు నీరు చేరి కావాల్సిన సాగునీరు రావడంతో తిరిగి వరిపంటను విస్తారంగా సాగు చేశారు. దీనివల్ల తిండిగింజలకు యేడాదంతా ఇబ్బంది ఉండదు.

- కొండా శ్రీసివానుసులు, మందపల్లె, రాజంపేట

ఏడాదికి ఒక దూడ.. రైతుకు లాభసాటి



పశువులకు చికిత్స చేస్తున్న వెటర్నరీ ఏడీ విశ్వేశ్వరరెడ్డి

వాల్మీకిపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏడాదికి ఒక దూడ రైతుకు లాభసాటి అని వాల్మీకిపురం వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శనివారం పత్తేపురం గ్రామంలో పశువులకు ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఇందులో 200కు పైగా పశువులకు సూడి పరీక్షలు, ఆవులకు గర్భకోశ వ్యాధి చికిత్స, దూడలకు ఏలిక పాముల నివారణ, ఆవులకు గోమార్లు, పిడుదులకు బోటాక్స్ స్ప్రే తదితర వైద్యం చేశారు. ఆయన మాట్లాడుతూ ఆవు ఈనిన నెల నుంచీ రెండు నెలల్లోపు ఎదకు వచ్చిన ఆవుకు కృత్రిమ గర్భధారణ చేయిస్తే రైతుకు లాభసాటి అని, ఈ విధంగా ఏడాదికి ఒక దూడను పొందవచ్చన్నారు. పెయ్య దూడ పుట్టే విధంగా వీర్యకణాలు అందుబాటులో ఉన్నాయని, ఆవు ఎదకు వచ్చిన సమయాన ఈ వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయిస్తే పూర్తి పెయ్య దూడలే పుడతాయన్నారు. ఈ వీర్య నాలిక ఖరీదు రూ.150లకు సబ్సిడీతో ప్రభుత్వం ఇస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

సుండుపల్లె, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటలో జూదమాడుతున్న అరుగురిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మండల కేంద్రానికి సమీపంలోని రాచంవాండ్లపల్లె వద్ద ఉన్న మామిడి తోటలో జూదమాడుతున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.4,300 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ స్వాధీనం





ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్, గాయపడ్డ నాగేశ్వర్‌నాయక్

సుండుపల్లె, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొని మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ మిట్టబిడికి కాలనీకి చెందిన నాగేశ్వర్‌నాయక్‌కు శనివారం తీవ్రగాయాలయ్యాయి. పింఛా నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఎలమందకు చెందిన ట్రాక్టర్ ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తిని ఢీకొంది. స్థానికులు వెంటనే పోలీసులకు, 108 వాహనానికి సమాచారం ఇచ్చి క్షతగాత్రుడిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా తిరుపతికి రెఫర్ చేసినట్లు బాధిత కుటుంబీకులు తెలిపారు. ఎలమంద, రొంపిచర్ల, పీలేరు, కేవీపల్లి, భాకరాపేట వంటి సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ప్రతి రోజు పింఛా ప్రాజెక్టు దిగువ భాగంలోని నది నుంచి, బాహుదానది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని ప్రమాదానికి ఇసుక అక్రమ రవాణానే కారణమని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు



గాయపడ్డ కృష్ణారెడ్డి

రాయచోటి-నేతాజీ సర్కిల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారిలోని దేవపట్ల బస్టాప్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తిక్కం కృష్ణారెడ్డి అనే వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... దేవపట్ల గ్రామం కట్టుగుత్తపల్లికి చెందిన తిక్కం కృష్ణారెడ్డి దేవపట్ల నుంచి టీవీఎస్ ఎక్సెల్ వాహనంలో స్వగ్రామానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా కలకడ వైపు నుంచి వస్తున్న స్కూటర్ ఢీకొంది. ప్రమాదంలో తలకు తీవ్రగాయం కావడంతో అతడిని తిరుపతి ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

క్రీడల్లో గురుకులం విద్యార్థుల సత్తా

తంబళ్లపల్లె, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఎస్టీ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు డివిజన్ స్థాయి ఆటల్లో సత్తా చాటి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పీఈటీ దేశ్‌ముఖ్ తెలిపారు. శుక్రవారం మదనపల్లె ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాలబాలికలకు నిర్వహించిన ఆటల పోటీల్లో అండర్-17 బాలుర ఖోఖోలో శశినాయక్, నాగేంద్రబాబు నాయక్, వాలీబాల్, ట్రిపుల్ జంప్‌లో నిరంజన్ నాయక్, అండర్-14 యోగాలో చరణ్ సత్తా చాటి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న మహిళ

మదనపల్లె అర్బన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కురబలకోట మండలంలో జరిగింది. ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కురబలకోట మండలం అంగళ్లుకు చెందిన సుబ్రహ్మణ్యం భార్య శిల్పా (35) కుటుంబ సభ్యులతో గొడవపడి ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- కండక్టర్‌కు తీవ్ర గాయాలు...



గాయపడ్డ కండక్టర్ వెంగమణి

ఒంటిమిట్ట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో కండక్టర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... మండల కేంద్రంలోని ఒంటిమిట్ట చెరువు కట్టపై ఉన్న ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ఆగి ఉన్న లారీని తిరుపతి వైపు వెళ్తున్న పులివెందుల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో కండక్టర్ వెంగమణి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దుకాణాల ఏర్పాటుకు స్థల పరిశీలన



మిషన్ కాంపౌండులో అధికారులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో రెండు చోట్ల బాణసంచా దుకాణాల ఏర్పాటుకు స్థల పరిశీలన జరగడంతో ప్రతిపాదనలు పంపుతున్నట్లు తహసీల్దార్ కిశోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని మిషన్ కాంపౌండు, టిప్పు సుల్తాన్ మైదానంలో రెవెన్యూ, ఫైర్, పోలీసు, ఎస్పీడీసీఎల్, మున్సిపల్ అధికారులు శనివారం జాయింట్ సర్వే నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మిషన్ కాంపౌండు, టిప్పుసుల్తాన్ మైదానంలో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అనువుగా ఉన్నట్లు నిర్ధారించామన్నారు. సబ్‌కలెక్టర్‌కు నివేదికలు పంపుతామన్నారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ శివప్ప, వన్ టౌన్ ఎస్ఐ అన్సర్‌బాషా, ఆర్ఐ బాలసుబ్రమణ్యం, బాణసంచా దుకాణాల నిర్వాహకులు పాల్గొన్నారు.

అక్రమంగా కలప డంప్...?

- పట్టించుకోని అధికారులు



గుర్రంకొండ-సరిమడుగు మార్గంలో మసీదు పక్కన డంప్ చేసిన కలప

గుర్రంకొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కలప వ్యాపారులు ఇష్టానుసారంగా వృక్షాలను నరికేస్తున్నారు. రైతుల పొలాలు, ప్రభుత్వ భూముల్లో వృక్షాలను నరికేసి చీకటి పడగానే ట్రాక్టర్లలో ఓ చోట డంప్ చేస్తున్నారు. ఇలా డంప్ చేసిన కలపను తమిళనాడు, తెలంగాణ ప్రాంతాలకు లారీల్లో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమంగా డంప్ చేసిన కలప గురించి రైతులు, ప్రజలు అధికారులకు తెలిపినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని చెర్లోపల్లె, టి.పసలవాండ్లపల్లె, సరిమడుగు, గుర్రంకొండ, నడిమిఖండ్రిగ, సంగసముద్రం, శెట్టివారిపల్లె, తరిగొండ గ్రామాల్లో రేజూ చింత, మామిడి, నేరేడు, వేప, కానుగ, మర్రి వృక్షాలను రంపాలతో తొలగిస్తున్నారు.

ఇలా నరికేసిన వృక్షాలను పాలకుంటపల్లె, సరిమడుగు, తలారివాండ్లపల్లె, మార్కెట్ యార్డు, టి.పసలవాండ్లపల్లె గ్రామాల్లో అక్రమంగా కలపను డంప్ చేస్తున్నారు. ఈ డంప్‌లను లారీలకు లోడ్ చేసి తమిళనాడుకు తరలిస్తున్నారు. కలప డంప్‌పై రైతులు, ప్రజలు రెవెన్యూ, అటవీ శాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గుసగుసలాడున్నారు. ఈ విషయమై ఆర్ఐ సదాశివప్పనాయుడును వివరణ కోరగా సరిమడుగు మార్గంలో అక్రమంగా కలప డంప్ చేసినట్లు తన దృష్టికి రాలేదన్నారు. కలప డంప్‌ను పరిశీలించి అనుమతులు లేకుంటే సీజ్ చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

నూతన ఆస్పత్రికి గ్రహణం

- భవన నిర్మాణం పూర్తయి రెండేళ్లు
- ప్రారంభానికి నోచుకోని వైనం



ప్రారంభానికి నోచుకోని నూతన ఆస్పత్రి భవనం



శిథిలావస్థకు చేరిన పాత పీహెచ్‌సీ

చిట్వేలి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : చిట్వేలి 21 పంచాయతీలున్న పెద్ద మండల కేంద్రం. కానీ ఇక్కడ ప్రజలకు కావాల్సిన సౌకర్యాలు అంతంత మాత్రమేనని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతిరోజూ 200 మందికి పైగా వైద్యసేవలు పొందుతున్నారు. ఇక్కడ ఆస్పత్రి నూతన భవన నిర్మాణం పూర్తయి రెండేళ్లయినా ఇంతవరకు ప్రారంభానికి నోచుకోలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే భవన నిర్మాణం పూర్తయి కాంట్రాక్టర్ తాళాలు అప్పగించినా అప్పట్లో ప్రారంభానికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర గడిచినా ఈ ప్రభుత్వం కూడా పట్టించుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నూతన భవనానికి గ్రహణం ఎప్పుడు వీడుతుందో అని ఎదురుచూస్తున్నారు. భవనం పూర్తయి రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు నూతన భవనంలో రోగులకు వైద్యసేవలు నోచుకోలేదని ప్రజల నుంచి తీవ్రంగా విమర్శలు వినపడుతున్నాయి. కోటికి పైగా నిధులు వెచ్చించి సరికొత్తగా నూతన భవనాన్ని నిర్మించారు. భవనం పూర్తయి రోగులకు వైద్యసేవలు మెరుగ్గా అందుతాయని మండల ప్రజలు ఎంతగానో ఎదురు చూస్తున్నప్పటికీ ఇంతవరకు అది ప్రారంభానికి నోచుకోలేదు. పాత భవనంలో పూర్తిగా పాడవడంతో వర్షం కురిస్తే చాలు భవనంపై పెచ్చులు ఎప్పుడు ఊడి పడతాయోనని భయంతో సిబ్బంది, అటు రోగులు భయందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న చిన్న మరమ్మతులు చేసుకుంటూ తాత్కాలికంగా పాత భవనంలో వైద్యసేవలు అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చింది త్వరలో నూతన భవనంలో వైద్యసేవలు అందుతాయనుకున్న ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన నూతన భవనంలో వైద్యసేవలు ప్రారంభించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

డాక్టర్ల నిర్లక్ష్యంతో పసికందు మృతి

- ప్రభుత్వ ఆస్పత్రిలో ఘటన
- చిన్నారి బంధువుల ఆందోళన
- పోలీసులకు ఫిర్యాదు



మృతి చెందిన పురిటిబిడ్డ

మదనపల్లె అర్బన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కళ్లు తెరవకనే పసికూనను కడతేర్చిన సంఘటన మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం జరిగింది. బాధితులు మదనపల్లె టూటౌన్ పోలీసులకు డాక్టర్ల నిర్లక్ష్యంపై ఫిర్యాదు చేశారు. బాధితుల వివరాల మేరకు... చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లె కుమ్మరవీధికి చెందిన ప్రసాద్, కవిత దంపతులకు మొదటి కాన్పులో ఆడబిడ్డకు సాధారణ ప్రసవం జరిగింది. తిరిగి 11 ఏళ్ల తరువాత గర్భం దాల్చి రెండో ప్రసవం కోసం శుక్రవారం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి మధ్యాహ్నం 3 గంటలకు వచ్చారు. పరీక్షలు చేసిన డాక్టర్లు అంతా సవ్యంగా ఉందని, తొందర ఏమీ లేదని తెలిపారు. బాధితులు రాత్రి 6 గంటలకు కూడా ఏమైనా ఇబ్బంది ఉంటే మరోచోట చూపించుకుంటామని డాక్టర్లతో చెప్పారు. నొప్పులు వస్తున్నాయి ఆలస్యంగా కాన్పు అవుతోందని, తొందరపడితే కాదని చెప్పడంతో మిన్నకుండిపోయారు. శనివారం కడుపులో బిడ్డ కదలలేదని గుర్తించి పది గంటలకు కాన్పు చేశారు. అప్పటికే బిడ్డ చనిపోయింది. పసికందు కనులు తెరవకనే డాక్టర్లు కడతేర్చారని బాధితులు వాపోయారు. ఎన్నో ఏళ్ల తరువాత గర్భం నిలిస్తే డాక్టర్లు గర్భశోకం మిగిల్చారని విలపించారు. డాక్టర్లపై కేసు నమోదు చేయాలని బాధితులు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారించి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

దర్జాగా ప్రభుత్వ భూమికి కంచె...

- ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూముల ఆక్రమణ
- కంచెను తొలగించిన అధికారులు



ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి



కంచెను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

ఒంటిమిట్ట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు అక్రమార్కులు అక్కడ ప్రత్యక్షమవుతున్నారు. ప్రభుత్వాలు మారినా అక్రమార్కులు మాత్రం మారడం కారణం ఆక్రమణదారులపై ఎటువంటి చర్యలు లేకపోవడంతో వారు యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతూనే ఉన్నారు. మండంలోని గొల్లపల్లి, ధవంతంపల్లి గ్రామాల్లో సర్వే నెం-78, 662లో అక్రమార్కులు కన్నేసి దర్జాగా ప్రభుత్వ భూములను ఆక్రమించారు.

కొండను సైతం పిండి చేశారు యంత్రాల సాయంతో చదును చేసి కంచెను కూడా ఏర్పాటు చేశారు. ఇంత జరుగుతున్న రెవెన్యూ అధికారులకు తెలియకపోవడం హస్యాస్పదంగా ఉంది. మండల కేంద్రమైన ఒంటిమిట్ట నుంచి పది కిలోమీటర్ల లోపే ఉన్న ఈ గ్రామాలలో భూఆక్రమణలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. వీటి వెనుక ఎవరి హస్తమున్నదో అధికారులు నిగ్గు తేల్చాల్సి ఉంది. సర్వే నెం.78లో గొల్లపల్లి గ్రామానికి చెందిన తోప్పెన అన్నపూర్ణమ్మ పేరుతో సుమారు 13 ఎకరాలు ఆక్రమించేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన తుంగ గోపయ్య మూడు ఎకరాలు ఆక్రమించారు. ధవంతంపల్లి గ్రామంలోని 662 సర్వే నెంబర్‌లో 4 ఎకరాలు వెంకటసుబ్బయ్య ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని చదును చేశారు. ఈ సమాచారం రెవెన్యూ అధికారులకు ఆలస్యంగా తెలియడంతో రంగప్రవేశం చేసి ఆక్రమణకు గురైన భూములను పరిశీలించి కంచె తొలగించారు. ఈ విషయమై తహసీల్దార్ దామోదర్ రెడ్డిని వివరణ కోరగా ఆక్రమణకు గురైన భూమిని పరిశీలించి కంచెను తొలగించామన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



మృతి చెందిన లక్ష్మీదేవి

సీకేదిన్నె, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో మంగళి లక్ష్మీదేవి(40) మృతి చెందినట్లు సీకేదిన్నె పోలీసులు తెలిపారు. వారు అందించిన సమాచారం మేరకు... చింతకొమ్మదిన్నె మండలం బుగ్గవంకలో శనివారం మేకల కాపరి మేకలు మేపుకుంటుండగా ఓ గుర్తు తెలియని శవాన్ని చూసి సీకేదిన్నె పోలీసులకు సమాచారం అందించాడు. దీనిపై పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. అనంతరం గతంలో ఈ నెల 4వ తేదీన మహిళ అదృశ్యంపై నమోదైన కేసు తరుపు బంధువులను పిలిపించి చూపించగా చనిపోయిన వ్యక్తి మామిళ్లపల్లె జగనన్న కాలనీకి చెందిన మంగళి బుగ్గరమేష్ భార్య లక్ష్మీదేవిగా గుర్తించారు. కర్నూలు జిల్లాకు చెందిన వీరు పది సంవత్సరాల క్రితం కడపకు వచ్చి ఇక్కడే నివాసం ఉంటున్నట్లు వారి బంధువులు తెలిపారు. బుగ్గరమేష్, అతని కుమారులు ఇద్దరు ఇందిరానగర్‌లో హెయిర్‌కటింగ్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారని, ముగ్గురు మూడు కటింగ్ షాపులు నిర్వహిస్తూ జగనన్న కాలనీలో నివాసం ఉంటున్నారన్నారు. అయితే రమేశ్ తాగుడుకు అలవాటుపడి మానకపోవడంతో సెప్టెంబరు 30న ఇంటిలో గొడవ జరిగిందని, మద్యం వ్యసనం మానుకోవాలని కుటుంబ సభ్యులు ఎంత చెప్పినా వినకపోవడంతో ఆరోజు రాత్రి అందరు పడుకుని తెల్లవారి లేచేసరికి 1వ తేదీ మంగళి లక్ష్మీదేవి కనిపించకుండాపోవడంతో వారి కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రదేశాల్లో వెతికి, బంధువుల ఇండ్ల వద్ద విచారించి చివరకు 4వ తేదీన పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కనిపించకుండా పోయిన మహిళ శనివారం బుగ్గవంకలో మరణించిందనే విషయం తెలుసుకుని వారి బంధువులను పిలిపించి నిర్ధారించుకున్న తర్వాత మృతదేహం కుళ్లి వాసన వస్తుండడంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పుట్టి మునిగింది..

ఆరుగాలం కష్టించి పండించిన పంట దళారుల పాలవుతోంది. రైతు కష్టపడి పండించిన ధాన్యానికి దళారులే ధర నిర్ణయిస్తున్నారు. వారు చెప్పిన ప్రకారమే కర్షకుల కష్టం అమ్ముకోవాల్సి వస్తోంది. దీంతో పుట్టి ధాన్యానికి (8బస్తాలు) పదివేల రూపాయలకు పైగా ఖరీఫ్ రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తుందని ప్రకటించినా రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ధర పెంచాలని కోరినా ససేమిరా అంటున్నారు. దళారులు చెప్పిన ధరతో పుట్టి ధాన్యం నష్టంతో అమ్ముకోవాల్సిన పరిస్థితి. రైతులకు నష్టాల బాధ తప్పలేదు.



లారీలోకి ధాన్యం బస్తాలు ఎక్కిస్తున్న వైనం



అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు

- దళారులు చెప్పిందే ధర
- నష్టపోతున్న రైతులు

చెన్నూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది కేసీ కెనాల్‌కు కాసింత నీరు రావడంతో ఆయకట్టు కింద మండల వ్యాప్తంగా 3600 ఎకరాలకు పైగా వరి సాగు చేపట్టారు. వారంరోజులుగా ఈ వరి పంట కోతలు మొదలయ్యాయి. ఇప్పటికే చెన్నూరుతో పాటు కనుపర్తి, దౌలతాపురం, బలసింగాయపల్లె, రామనపల్లె ప్రాంతాల్లో వరి కోతలు జరుగుతున్నాయి. అయితే వరి ధాన్యాన్ని తక్కువ రేటుకు అమ్ముకోవద్దు, గిట్టుబాటు ధర కల్పిస్తామని కూటమి ప్రభుత్వం పదే పదే చెబుతున్నా రైతులు కోసిన వెంటనే ధాన్యాన్ని అమ్ముతున్నారు. దళారులు ఇదే అదునుగా భావించి ధర తగ్గించి కొనగోలు చేస్తున్నారు. పదిరోజుల క్రితం మొదటి దశగా వరికోత చేపట్టగా ఆ తరువాత రెండు రోజులకే పుట్టి ధాన్యం (8బస్తాలు) రూ.11,600 వంతున దళారులు కొన్నారు. ప్రభుత్వం మాత్రం ఎక్కువ ధర ఇస్తామని చెప్పడంతో ఈ విషయం రైతులు దళారులకు చెప్పి కాసింత ధర పెంచాలని కోరినా ససేమిరా ఒప్పుకోకపోగా మేం చెప్పిందే ధర, అమ్మితే అమ్మండి.. లేదంటే లేదంటున్నారు దళారులు. గతి లేక దళారులకు తక్కువ ధరకు అమ్ముతున్నారు.

మండలంలో రెండు కొనుగోలు కేంద్రాలు

మండల వ్యాప్తంగా రైతులు పండించిన ధాన్యం కొనేందుకు చెన్నూరుతో పాటు రామనపల్లెలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఇప్పటికే కలెక్టరు ప్రకటించారు.

పుట్టికి నష్టం

పుట్టి ధాన్యాన్ని నష్టంతో అమ్ముకుంటున్నాడు. ప్రభుత్వం మాత్రం రూ.14వేలకు పైగానే కొంటామంటోంది. అయితే అప్పు చేసి సాగు చేసిన రైతు పంటను అమ్మి కొంత వరకైనా అప్పు తీర్చాలని దళారులకు విక్రయిస్తున్నాడు. పైగా ఈ ఖరీఫ్ సీజన్‌లో నాలుగు పుట్లు (32 బస్తాలు) మించి దిగుబడి రాలేదు. ఖర్చు ఎకరాకు రూ.30వేలకు పైమాటే. నాలుగు నెలల పాటు కష్టపడ్డ రైతుకు ఎకరాకు మిగిలింది ఐదువేల వరకు వచ్చినా కనీసం కూలీ కూడా గిట్టుబాటు కాని పరిస్థితి.

మంచి గిట్టుబాటు ధర అందిస్తుంది..

పండించిన పంటకు ప్రభుత్వం మంచి గిట్టుబాటు ధర కల్పిస్తోంది. ప్రభుత్వం గ్రేడ్ ఎ రకం క్వింటా రూ.2389 అందిస్తుంది. అయితే దళారులకు అమ్మితే క్వింటా రూ.1813కే అమ్ముకోవాల్సి వస్తుంది. దీంతో రైతు నష్టపోవాల్సిందే. కాసింత ఓపిక పడితే ప్రభుత్వమే కొని మంచి గిట్టుబాటు ధర ఇస్తుంది. రైతులు తొందరపడి దళారులకు అమ్ముకోవద్దు. ఇప్పటికే రైతులకు ఈ విషయం తెలిపాం. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం ఏం చేయాలో అన్ని చర్యలు తీసుకుంటుంది.

- ఎ.శ్రీదేవి,
మండల వ్యవసాయాధికారి, చెన్నూరు

రైల్వే క్యాంటీన్ సేల్స్‌మాన్ ఆత్మహత్య



మృతి చెందిన సురేశ్

ఎర్రగుంట్ల, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ క్యాంటీన్‌లో సేల్స్‌మాన్‌గా పని చేస్తున్న కంభం సురేశ్(32) శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. జమ్మలమడుగుకు చెందిన సురేశ్ స్థానిక మెయిన్‌బజార్ లోని అమ్మవారిశాల పక్కనున్న రైల్వే క్యాంటీన్‌లో ఓ గదిలో ఉరి వేసుకున్నట్లు తెలిపారు. క్యాంటీన్ నడుపుతున్న యాజమానికి సురేశ్ డబ్బులు బాకీ ఉన్నాడు. కానీ కొంతకాలంగా సురేశ్ ఇక్కడ పనిచే యకుండా వెళ్లిపోయాడు. అకస్మాత్తుగా ఇటీవల కడపలో సదరు యజమానికి సురేశ్ కనిపించగా కొట్టి, మందలించి డబ్బులు చెల్లించాలని ఒత్తిడి తెచ్చినట్లు సీఐ తెలిపారు. డబ్బు కట్టలేనని, అయితే ఎర్రగుంట్లకే వచ్చి క్యాంటీన్‌లో పని చేస్తానని తెలిపి ఇక్కడికి వచ్చి పని చేస్తున్నాడన్నారు. అయితే కొట్టినందుకు మనస్థాపం చెందాడా లేక మరేం జరిగిందో కాని శుక్రవారం రాత్రి ఇంట్లోని ఓ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ వివరించారు. వీఆర్‌వో విజయభాస్కర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

టపాసుల అక్రమ నిల్వలపై దాడి



పట్టుబడిన టపాసులు, పేలుడు పదార్థాలు

ప్రొద్దుటూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం శ్రీనివాసనగర్‌లోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన పేలుడు పదార్థాలను టూటౌన్ సీఐ సదాశివయ్య ఆధ్వర్యంలో శనివారం సీజ్ చేశారు. ఆ వివరాల్లోకి వెళితే.. శ్రీనివాసనగర్‌లో షేక్ నూర్ జహాన్, ఆమె కుమారుడు షరీఫ్ లైసెన్సు లేకుండా పేలుడు పదార్థాలు బయటనుంచి తీసుకువచ్చి అక్రమంగా నిల్వ చేసుకున్నారు. అలాగే టపాసులు చేయడానికి మందుగుండు సామగ్రిని కూడా ఇంట్లో భద్రపరిచారు. ఈ మేరకు సమాచారం రావడంతో శనివారం సీఐ ఆధ్వర్యంలో దాడులు చేసి పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు షేక్ నూర్‌జహాన్, ఆమె కుమారుడు షరీఫ్‌లపై కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. ఎవరైనా లైసెన్సు లేకుండా ఇళ్లలో టపాసులు, మందుగుండు సామగ్రి ఉంచుకున్నా, తయారు చేసినా సమాచారమివ్వాలని కోరారు.

కానిస్టేబుల్‌పై దాడి

- ఇరువురిపై కేసు నమోదు

కడప క్రైం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కడప నగరం మాసాపేటకు చెందిన బ్లూకోల్ట్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన ఇరువురిపై కేసు నమోదు అయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కడప టూటౌన్‌లో పనిచేస్తున్న బ్లూకోల్ట్ కానిస్టేబులు నాలుగు రోజులక్రితం రాత్రి విధులు నిర్వహిస్తున్న సమయంలో మాసాపేట వద్ద ఓపెళ్లి ఫంక్షన్‌లో కొందరు డ్యాన్స్ చేస్తుండగా బ్లూకోల్ట్ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో జిల్లా పోలీసు కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి మరో వ్యక్తి కలిసి ఆ కానిస్టేబులుపై దాడి చేశారు. కానిస్టేబులు ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేశారు.

రైలు కిందపడి గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య

కడప క్రైం, అక్టోబర్ 11(ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ఓ గుర్తు తెలియని మహిళ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు... శనివారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో 50 సంవత్సరాల గుర్తు తెలియని మహిళ కనుమలోపల్లి రైల్వేస్టేషన్ మధ్యలో కడప-కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రైలుకు అడ్డంగా వెళ్లి దాని కిందపడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న రైల్వేపోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కడప రిమ్స్ మార్చురీ గదికి తరలించారు. అయితే ఈమె వద్ద ప్లాస్టిక్ సంచిలో ప్లాస్టిక్ బాటిళ్లు ఉండడంతో ఆమె ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకుని జీవనం సాగించే మహిళగా తెలుస్తోందన్నారు. వివరాలు తెలిసిన వారు కడప రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్

మైదుకూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మైదుకూరు బస్టాండు ప్రాంగణంలో నిలిపిన ద్విచక్ర వాహనాల యజమానులకు శనివారం సీఐ రమణారెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇటీవల ద్విచక్ర వాహనదారులు పబ్లిక్ ప్రదేశాలలో బాధ్యతారహితంగా భద్రత లేకుండా పార్కింగ్ చేయడం వలన దొంగతనాలు జరుగుతుండటంతో స్పందించిన సీఐ చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో సైడ్‌లాక్ వేయకుండా పార్క్ చేసిన మోటారు సైకిళ్లను ఒకచోటకు తీసుకువచ్చి, వాహనాల యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కచ్చితంగా మోటారు సైకిళ్లకు సైడ్‌లాక్ వేసుకోవాలని, పోలీసు సూచనలు పాటించాలని ఆయన కోరారు.

శ్రీవెంకటేశం.. మనసా స్మరామి



ఇరుదేవేరులతో శ్రీవారు



- దేవునికడప శ్రీవారిని దర్శించుకున్న భక్తులు

కడప కల్చరల్, అక్టోబర్ 11(ఆంధ్రజ్యోతి): శ్రీశ్రీనివాసం.. శ్రితపారిజాతం.. శ్రీవెంకటేశం.. మనసా స్మరామి" అంటూ భక్తులు దేవునికడప లక్ష్మీవెంకటేశ్వస్వామిని స్మరించారు. తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవునికడప లక్ష్మీవెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు శనివారం పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. స్వామివారి దర్శనం కోసం బారులు తీరి ఎంతో సహనంతో స్వామివారిని కన్నులారా తిలకించి ఆనందభరితులయ్యారు. ఆలయంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు ప్రసాదాన్ని అందించారు.

టపాసుల విక్రయానికి దరఖాస్తుల ఆహ్వానం

- కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ సందర్భంగా నగరపాలక సంస్థ పరిధిలో టపాసుల విక్రయానికి వ్యాపారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ దరఖాస్తుదారులు ఈనెల 14వ తేదీ సాయంత్రం 5గంటలలోపు మున్సిపల్ కార్యాలయంలోని మేనేజర్‌ను సంప్రదించాలన్నారు. టపాసుల విక్రయానికి కావాల్సిన గ్రౌండ్, ఇతర రుసుములు కలిపి రూ.10వేలు చలానా రూపంలో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. నిర్దిత గడువు తర్వాత వచ్చే దరఖాస్తులు పరిగణలోకి తీసుకోబడవని స్పష్టం చేశారు. చెల్లింపు పూర్తిచేసిన దరఖాస్తుదారులకే లాటరీ ద్వారా స్టాళ్ల కేటాయింపులో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. అదేవిధంగా ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఇతర శాఖల నుంచి అవసరమైన అనుమతులు, లైసెన్సులు పొందడం కూడా తప్పనిసరి అన్నారు.

టాలెంట్ హంట్ వాయిదా

కడప స్పోర్ట్స్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రిమ్స్ సమీపంలో ఉన్న వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో ఈనెల 13 నుంచి 16వ తేదీ వరకు జరగనున్న మెన్స్ సెలక్షన్ అండర్-12, 14, 16, 19 టాలెంట్ హంట్ వాయిదా పడినట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ టాలెంట్ హంట్‌ను వాయిదా వేయాల్సి వచ్చిందని, తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామన్నారు.

ఉపాధ్యాయ వృత్తికి గౌరవం తెచ్చేలా పని చేయాలి

- మెగా డీఎస్సీలో ఉద్యోగం సాధించిన వారికి ఎమ్మెల్యే సన్మానం



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తికి గౌరవం తెచ్చేలా పని చేయాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అన్నారు. శనివారం స్థానిక అభ్యాస్ జూనియర్ కళాశాల ఆవరణలో మెగా డీఎస్సీలో ప్రొద్దుటూరు నియోజకవర్గంలో టీచర్ ఉద్యోగం సాధించిన 70 మందిని ఎమ్మెల్యే శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీ నిర్వహించి నిరుద్యోగుల కల నెరవేర్చారన్నారు. ప్రతి ఏడాది జనవరిలో డీఎస్సీ నిర్వహిస్తామని మంత్రి నారా లోకేశ్ కూడా ప్రకటించారన్నారు. ఉపాధ్యాయులు ఉద్యోగం వస్తే చాలని కాకుండా విద్యార్థులకు బాగా పాఠాలు చెప్పి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్లు ముక్తియార్, ఆసం రఘు, జబీవుల్లా, వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ జాకీర్, విశ్వబ్రాహ్మణ డైరెక్టర్ శ్రీనివాసాచారి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, మండల అధ్యక్షుడు సీతంపల్లె చంద్ర, మాజీ కౌన్సిలర్ వద్దిబాలుడు, బీజేపీ జిల్లా కార్యదర్శి కోనేటి క్రిష్ణప్రదీప్ రెడ్డి, జనసేన నేత జిలాన్ బాషా, లింగాపురం పీఏసీ చైర్మన్ సిద్దారెడ్డి నాగముని రెడ్డి, ఏంఈవోలు సావిత్రమ్మ, శోభారాణి పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుడి హల్‌చల్

- అదుపులోకి తీసుకున్న పోలీసులు



కడప నాగరాజుపేట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని ఎస్పీ బంగ్లా వద్ద ఓ యువకుడు నడిరోడ్డుపై వాహనాలు ఆపి వీరంగం సృష్టించాడు. మద్యం మత్తులో రోడ్లపై కార్లు ఆపి కేకలు వేశాడు. తాను సాఫ్ట్‌వేర్ ఉద్యోగినని, తన భార్య వదిలేసిందని, తన కూతురు చనిపోయినా కూడా ఎవరూ చెప్పలేదంటూ ఆక్రోషించాడు. దీంతో విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అతడిని అదుపులోకి తీసుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు.

బతుకు తెరువు కోసం వచ్చి బలి

- విద్యుదాఘాతంతో కడప జిల్లా వ్యక్తి మృతి



మృతి చెందిన జనార్దన్ ఫైల్‌ఫొటో

కుందుర్పి, అక్టోబరు 11(ఆంధ్ర జ్యోతి): బతుకుదెరువు కోసం ఓ వ్యక్తి ఊరుగాని ఊరికి వచ్చి బలైపోయిన సంఘటన శనివారం అనంతపురం జిల్లా కుందుర్పిలో జరిగింది. మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుదాఘాతంతో కడపజిల్లాకు చెందిన కూలీ జనార్దన్(43) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కుందుర్పిలో నూతన విద్యుత్ లైను ఏర్పాటు పనులను కాంట్రాక్టర్ రమేష్ గత కొన్ని రోజులుగా చేయిస్తున్నాడు. ఈ పనులు చేసేందుకు దినకూలీగా కడప జిల్లా ఆర్‌ఎస్ కొండాపురం మండలం కె.సుగుమంచుపల్లికి చెందిన జనార్దన్ వచ్చాడు. భార్య, పిల్లలు సొంతూరులో ఉండగా జనార్దన్ తోటి కార్మికులతో కలిసి కాంట్రాక్టర్ ఏర్పాటు చేసిన షెల్టర్‌లో ఉండేవాడు. ఈ నేపథ్యంలో శనివారం సబ్‌స్టేషన్‌లో పనులు చేస్తుండగా జనార్దన్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో ఆయన్ను అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య చంద్రకళ, ఇద్దరు కుమారులు ఉన్నారు. జనార్దన్ మృతి వార్తను భార్య, బంధువులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన అనంతపురం ఆస్పత్రికి చేరుకున్నారు. కొన్ని నెలలుగా తన భర్తకు కూలి కూడా ఇవ్వలేదని మృతుడి భార్య ఆరోపించారు. న్యాయం చేయమని అడిగితే బీమా పేరుతో కాంట్రాక్టర్ మోసం చేస్తున్నాడని కన్నీటి పర్యంతరమయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తృటిలో తప్పిన ప్రమాదం

బద్వేలుటౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జాతీయ రహదారి నెల్లూరు రోడ్డులో శనివారం ఫాతిమా చర్చీ ఎదురుగా ఆయిల్ ట్యాంకర్‌ను ఉదయగిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో బస్సు అద్దాలు పగిలాయి. దీంతో బస్సు ముందుభాగం దెబ్బతిన్నా ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

బద్వేలు పట్టణంలో చోరీ

బద్వేలుటౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జాతీయ రహదారి మైదుకూరురోడ్డులోని భావనారాయణ నగర్‌లో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఇంటి యజమాని మజ్జారి వెంకటసుబ్బయ్య కుటుంబసమేతంగా శుక్రవారం కాళహస్తికి వెళ్లడంతో, ఇంటికి తాళం వేసి ఉండటంతో దొంగలు దానిని గమనించి శనివారం తెల్లవారుజామున చాకచక్యంగా తాళాలు పగులకొట్టి ఇంటిలోని వెండి వస్తువులు, కొంతమేర నగదును చోరీ చేశారు. స్థానికులు ఉదయం గమనించి ఇంటి యజమానికి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే క్లూస్‌టీంను పిలిపించి వేలిము ద్రలు సేకరించారు. అనంతరం బాధితుల ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణను చేపట్టారు.

తల్లి మందలించిదని... ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రొద్దుటూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం సోములవారి పల్లె పంచాయతీ ఈశ్వర్ రెడ్డి నగర్‌లో నివాసం వుండే ఇమాంబాషా అలియాస్ మున్నా (22) అనే యువకుడు చెడువ్యసనాలకు బానిసై నందున తల్లి మందలించిందని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. రూరల్ ఎస్ఐ అరుణ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఈశ్వర్‌రెడ్డి నగర్‌లోని మాబున్నా, గౌస్‌బాషా దంపతులకు ఇద్దరు పిల్లలు వున్నారు. గౌస్‌బాషా బతుకుదెరువు కోసం కువైట్‌లో వుంటున్నాడు. తల్లి మాబున్నా ఇద్దరు పిల్లలను పోషిస్తోంది. కుమారుడు ఇమాంబాషా అలియాస్ మున్నా చదువును మధ్యలోనే ఆపేసి చిన్నచిన్న పనులు చేసేవాడు. ఈక్రమంలో చెడువ్యసనాలకు బానిసై ఇంట్లో నుంచి వెళితే వారం రోజులు ఇంటికి రాకుండా బయటబయటే తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో తల్లి మందలించడంతో శుక్రవారం ఇంట్లో నుండి వెళ్లి ఎర్రగుంట్ల రోడ్డులోని ఫారెస్టు ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లి మాబున్నా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ అరుణ్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

హనుమా.. కనుమా..!

ఆంజనేయస్వామి గుడి ముందు మురుగుకంపు

చెన్నూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నిత్యం పూజా కార్యక్రమాలు జరిపే గుడి ముందు వ్యర్థాల నిల్వతో దుర్వాసన అదరగొడుతోంది. పారిశుధ్యానికి ప్రజలు సహకరించండి, అందరం ఆరోగ్యంగా ఉంటాం, రోగాలను తరిమికొడతాం అంటూ ప్రభుత్వం ఓ వైపు చెబుతుంటే ఆ మాటలు చెవికెక్కని కొందరు వ్యర్థాలను ఇష్టానుసారంగా ఎక్కడ పడితే అక్కడ వేయడం జరగుతోంది. అవి గాలికి కొట్టుకువచ్చి మురుగునీటిలో తేలి దుర్వాసనకు కంపునకు మూలమవుతున్నాయి. నెలల తరబడి నిల్వ ఉండడంతో ఆ వ్యర్థాలు కుళ్లి దుర్వాసన వస్తోంది. చెన్నూరులోని హైవే రహదారిలో బుడ్డాయపల్లె వెళ్లే దారిలో ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఇలాంటి మురుగు వ్యర్థాల నిల్వ పెద్దకుప్పగా తయారైంది. రోజూ గుడికి వచ్చే ప్రజలు ఆ వాసన భరించలేక ముక్కుమూసుకుని బయటికి పరిగెత్తాల్సిన పరిస్థితి. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ మురుగు వాసన మరింత దారుణంగా ఉంటుంది. సంబంధిత అధికారులు, పాలకులు దృష్టి పెట్టి ఈ మురుగునీటిలో ఉన్న వ్యర్థాలు తొలగించి భక్తులు ప్రశాంతంగా భగవంతున్ని మనసారా స్మరించుకునే భాగ్యాన్ని కల్పించాలని కోరుతున్నారు.


చెన్నూరు బుడ్డాయపల్లె ఆంజనేయుని గుడి ముందు వ్యర్థాల కుప్ప

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాష, మాజీ మేయర్ సురేష్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం కడప నగరం మాజీ డిప్యూటీ సీఎం కార్యాలయంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టే ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

విద్య, వైద్యాన్ని ప్రైవేటీకరణ చేస్తే పోరాటమే

కమలాపురం రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్య వైద్యాన్ని ప్రైవేటీకరణ చేస్తే పోరాటం తప్పదని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్‌రామాంజులరెడ్డి తెలిపారు.శనివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరించి పీపీపీ విధానం పట్ల శ్రద్ధ చూపుతుందన్నారు.

జలమయంగా మారిన కడప నగరం

కడప నగరంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కడప నగరం జలమయంగా మారింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి నగరంలోని రహదారులు నీటిలో మునిగిపోయాయి. చౌటపల్లె వద్ద బ్యాంకు కాలనీ మృత్యుంజయకుంట తదితర ప్రాంతాల్లో వర్షం నీరునిలిచిపోయింది. జనాలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఉరుములు మెరుపులతో కూడి వర్షం కురవడంతో ప్రజల్లో భయాందోళన నెలకొంది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి


చౌటపల్లె వద్ద ఇళ్ల మధ్యలో చెరువును తలపిస్తున్న నీరు



స్టేట్ బ్యాంకు కాలనీలో ఇళ్ల మధ్య మురుగునీరు, మృత్యుంజయకుంట శివాలయం వెనక నిలిచిన నీరు

లా కాలేజ్, షామిరియా బ్రిడ్జి పనుల పరిశీలన

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో లా కాలేజ్, షామిరియా బ్రిడ్జి పనులను టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. నిర్మాణ స్థలాలను సందర్శించి, పనుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాణ్యతతో పనులు పూర్తిచేసి సమయానికి ప్రజలకు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ బ్రిడ్జీలు పూర్తయితే రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని, ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని ఆయన పేర్కొన్నారు.


పనులను పరిశీలిస్తున్న శ్రీనివాసరెడ్డి

సీఐటీయూ పోరాటాల ఫలితంగా జీఓ రద్దు

కడప నాగరాజుపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ఆధ్వర్యంలో చేసిన పోరాటాల ఫలితంగా వీఓఏ యానిమేటర్ల మూడేళ్ల కాల పరిమితి జీఓను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసుల రెడ్డి,చక్రపాణి తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో సాగర్, నాగశేఖర్‌రెడ్డి,చక్రపాణి, రాధ తదితరులు పాల్గొన్నారు.

1100క్వింటాళ్ల శనగలు మంజూరు

లింగాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో రైతులు పంటలు సాగు చేసేందుకు వాతావరణం అనుకూలంగా మారింది. నాలుగు రోజులుగా పదును వర్షాలు కురవడంతో రైతులు విత్తన సేకరణకు ప్రయత్నాలు ప్రారంభించారు. శనగ పంట సాగుచేసే రైతుల కోసం ప్రభుత్వం మండలానికి 1100 క్వింటాళ్ల విత్తన శనగలను మంజూరు చేసింది. 25శాతం రాయితీ ఉంటుంది. సోమవారం నుంచి ఆయా రైతు సేవా కేంద్రాలలో విత్తన శనగల నమోదు ప్రక్రియను ప్రారంభించేందుకు వ్యవసాయశాఖ సమాయత్తం అవుతోంది.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలి

కమలాపురం రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీయే కూటమి నేతలు ఎన్నికల ప్రచారంలో ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఈ మేరకు ఈ నెల 14న కడప ఆర్డీఓ కార్యాలయం వద్ద జరిగే ఆందోళనలో పెద్దఎత్తున ఆశాలు పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ కమలాపురం ఏరియాకార్యదర్శి పి.చంద్రశేఖర్, ఏపీ ఆశావర్కర్ సీనియర్ జిల్లా అధ్యక్షుడు మరియమ్మ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కమలాపురంలో విలేకరులతో మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 14న చేపట్టబోయే ఆందోళనలో ఆశాలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

హిందూ ధర్మ పరిరక్షణ ఆర్‌ఎస్‌ఎస్ ధ్యేయం

చక్రాయపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణ ఆర్‌ఎస్‌ఎస్ ధ్యేయమని ఆ సంఘం సహాయ నిర్వాహక్ లక్ష్మణ్, అప్పాలి త్రినాధి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం చక్రాయపేటలోని వేంకటేశ్వర కల్యాణమండపంలో రాష్ట్ర స్వయం సేవక్ సంఘ ఆధ్వర్యంలో విజయదశమి పురస్కరించుకొని సమావేశం ఏర్పాటుచేశారు. ప్రతి ఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణ కోసం కృషిచేయాలని ముఖ్యంగా యువత ముందుకు రావాలని ఆయన కోరారు. గోవును పూజిస్తే 33కోట్ల దేవతలను పూజించినట్లేనని ఆయన పేర్కొన్నారు. పిల్లలకు భగవద్గీత, రామాయణం లాంటివి చదివించాలన్నారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయప్రసాద్, బీజేపీ రామచంద్రారెడ్డి, గణేష్‌రెడ్డి, చక్రపాణిరెడ్డి రాధాకృష్ణ, రంగారెడ్డి, రఘునాథరెడ్డి, యోగీశ్వర్‌రెడ్డి, శ్రీను, ఇందుకూరు శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న త్రినాథి

మధ్యతరగతి వర్గాలకు సూపర్‌గిఫ్ట్‌గా జీఎస్టీ తగ్గింపు

కడప మారుతీనగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపు పేద, మధ్య తరగతి వర్గాలకు సూపర్ గిఫ్ట్‌గా ప్రభుత్వాలు అందించాయని టీడీపీ పద్మశాలీ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు మాసా కోదండరామ్ అన్నారు. సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై శనివారం సమితి ఆధ్వర్యంలో స్థానిక వారాహి హైస్కూలు లో విద్యార్థులకు ప్రత్యేకఅవగాహన కల్పించేందుకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరంప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

'ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం'

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయుల సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని బీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున విమర్శించారు. శనివారం కడపనగరం బహుజన టీచర్స్ యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయనతో పాటు ప్రధాన కార్యదర్శి సి.సుదర్శన్‌బాబు మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం నాలుగు నెలలు గడిచినా నాలుగు డీఏలు, ఐఆర్, పీఆర్సీ కమిటీపై చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎం.గంగరాజు, కట్టాగంగాధర్ పాల్గొన్నారు.

'రాష్ట్రం, సీమకు తీరని అన్యాయం'

కడపసెవెన్ రోడ్స్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మోదీ పాలనలో విభజన హామీలు అమలు చేయకపోగా రాష్ట్రానికి,రాయలసీమకు తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర విమర్శించారు. నరేంద్రమోదీ కర్నూలుకు ఏ ముఖం పెట్టుకొని వస్తారని శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో గాలి చంద్ర విమర్శించారు. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ ఈనెల 16న జీఎస్టీ ఉత్సవ కార్యక్రమానికి హాజరవుతున్న నరేంద్రమోదీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ కడప ఉక్కుపై హామీలను నెరవేర్చాలని పేర్కొన్నారు. సీపీఐ జిల్లాకార్యవర్గ సభ్యులు వెంకట్‌రాముడు,సమితి సభ్యులు నాగేశ్వరరావు, పిడుగు మస్తాన్ పాల్గొన్నారు.

వేంపల్లె పట్టణ టీడీపీ అధ్యక్షుడిగా వేమకుమార్

వేంపల్లె, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా నామా వేమకుమార్ నియామకమయ్యారు. మండల కమిటీ ఏర్పాటులో భాగంగా వేమకుమార్‌ను పట్టణ అధ్యక్షుడిగా నియమిస్తూ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. మండల కన్వీనర్‌గా గతంలో ఉన్న రామమునిరెడ్డి, ఉపాధ్యక్షులుగా పసుపులేటి వీరభద్ర, మైనార్టీ కన్వీనర్‌గా తెలంగాణ వలి, ఇతర కమిటీ సభ్యులను యథావిధంగా కొనసాగించారు.



క్రమశిక్షణ వ్యక్తులుగా కార్యకర్తలు

వీరపునాయునిపల్లె, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ గల వ్యక్తులుగా ఆర్‌ఎస్‌ఎస్ తీర్చిదిద్దుతోందని రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్‌ఎస్‌ఎస్) సంఘ్ కండ కార్యవాహ ఓబులేసు, గ్రామీణ వికాస్ జిల్లాసంయోజక్ మామిళ్ల ఈశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం వీఎన్‌పల్లె వీఆర్‌ఎస్ డిగ్రీ కళాశాల ఆవరణంలో విజయదశమి ఉత్సవంలో భాగంగా ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వంద సంవత్సరాలుగా 81వేల శాఖల ద్వారా లక్షలాది మందిని దేశభక్తులుగా, క్రమశిక్షణ గల వ్యక్తులుగా తీర్చిదిద్దుతోందన్నారు. ఈ కార్యక్రమంలో గృహ సంపర్క్ బాలినేని రాజేష్, ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు మధుసూధన్‌రెడ్డి, తులసినాయుడు, జనార్ధన్, ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అన్నీ అనర్థాలే

కడప నాగరాజుపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల వల్ల అన్నీ అనర్థాలేనని సమగ్ర శిశు అభివృద్ధి అధికారి వాణి పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొటెక్షన్ ఆఫీసర్ జిల్లా బాలల పరిరక్షణ అధికారి జి.సునీత, సూపర్‌వైజర్ మాబుచాను, సరితలు విద్యార్థినిలను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రత్నప్రభ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

వేంపల్లె, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బాలికల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత తెలిపారు. స్థానిక బాలికల సంక్షేమ వసతి గృహంలో బాలికలకు అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుభద్రమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను పూర్తిచేయాలి

వేంపల్లె, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో పెండింగ్‌లో ఉన్న ప్రధాన రోడ్లను పూర్తిచేయాలని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ రంతుల్లా డిమాండ్ చేశారు. ఆ పార్టీకి చెందిన జిల్లా ఉపాధ్యక్షుడు దాదాపీర్, ఇతర పార్టీ కార్యకర్తలతో కలిసి వేంపల్లె రోడ్డుపై శనివారం నిరసన తెలిపారు. కూటమి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా పనులు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి

జమ్మలమడుగు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని జమ్మలమడుగు డివిజన్ వీఆర్ ఏల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆమేరకు శనివారం వారు సమావేశమై వీఆర్‌ఏల సమస్యలపై చర్చించారు. అనంతరం కార్యాలయం ఎదురుగా రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శులు గురుమోహన్, వెంకటపతి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వీఆర్‌ఏలకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు డివిజన్ అధ్యక్షుడిగా ఆర్.ప్రసాద, ఉపాధ్యక్షుడిగా బి.సుబ్బరాయుడు, కార్యదర్శిగా కొండాపురం బాష, వర్కింగ్‌ప్రెసిడెంట్‌గా గండికోట ఖాజాహుస్సేన్, శాంతయ్య, చౌడమ్మ, ఆదిలక్ష్మి, జయరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జమ్మలమడుగు డివిజన్ పరిధిలోని వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

మున్సిపల్ గ్రౌండ్‌లో పటాకుల స్టాల్స్‌కు భూమిపూజ

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా కడప నగరం మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటుచేయనున్న పటాకుల స్టాల్స్‌కు శనివారం భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యేమాధవి పాల్గొని భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాయకులు దీపావళి పండుగ సందర్భంగా ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన పటాకుల విక్రయ కేంద్రాలు అందుబాటులో ఉండేలా చర్యలుచేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సూర్యనారాయణ, నగర అధ్యక్షుడు మన్సూర్ అలీ, శిలాస్, అశోక్‌రెడ్డి, జావీద్, గిరీష్, చిన్నబాబు తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

త్రికిరణ్ స్టడీ హాల్ ప్రారంభం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు సౌకర్యవంతమైన వేదికగా త్రికిరణ్ స్టడీ హాల్ ఆవిష్కృతమైందని ట్రాన్స్‌కో సీఐ నరసింహారెడ్డి తెలిపారు. శనివారం కడపనగరం అప్సర సర్కిల్ కపిల్ చిట్స్‌పై అంతస్తులో ఏర్పాటుచేసిన ఈ స్టడీ హాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు టి.సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతీ యువకులకు ప్రశాంతమైన, సదుపాయాలతో త్రికిరణ్ స్టడీ హాల్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. అలాగే వెస్ట్ మినిస్టర్ కోచింగ్ సెంటర్ తరగతి గదులను ప్రముఖ యోగా గురువు పి.అయ్యవారు రెడ్డి ప్రారంభించారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ లక్ష్యాలను సాధించాలని ఆయన సూచించారు.


స్టడీ హాల్‌ను ప్రారంభిస్తున్న ట్రాన్స్‌కో సీఐ నరసింహారెడ్డి

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

చెన్నూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలపల్లెలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శనివారం సీతారామ లక్ష్మణ హనుమత్ విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించి సాయంత్రం గ్రామోత్సవం చేశారు. ఈ కార్యక్రమాలకు మండలంలోనే కాకుండా ఇతర మండలాల నుంచి కూడా పలువు రు ప్రజలు హాజరయ్యారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.కార్యక్రమాలను గ్రామ నేతలు భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శివయ్యయాదవ్, మిలిటరీ ఈశ్వర్‌రెడ్డి, పర్వతరెడ్డి, ఆదిమూలం వెంకటసుబ్బయ్యయాదవ్, పుల్లయ్యయాదవ్, ఆర్.సుబ్బారెడ్డి, టీడీపీ కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి, శివారెడ్డి, పాలగిరి పెద్దసుబ్బారెడ్డి,జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్,లేబాక సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

వార్డు ప్లానింగ్ సెక్రటరీస్ అసోసియేషన్ జోనల్ కమిటీ ఎంపిక


నూతనంగా ఎంపికైన జోనల్ కమిటీ సభ్యులు

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా వార్డుప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రథమ రాయలసీమ జోనల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం అడ్‌హక్ జోనల్ కమిటీని ఏర్పాటుచేశారు. అలాగే సమావేశంలో సర్వీస్ రూల్స్ పేస్కేల్, ప్రమోషన్లు వంటి ప్రధాన సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా అధ్యక్షుడు గోపీచంద్, జనరల్ సెక్రటరీ మహేష్, ట్రెజరర్ రామసుబ్బారెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ నవీన్, టౌన్ ప్రెసిడెంట్ నాగార్జున పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించండి


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ హసీన

వేముల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా సూచించారు. శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వ్యాసచన పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలు చేయాలి

కడప మారుతీనగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలను అమలు చేయాలని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున ధ్వజమెత్తారు. శనివారం స్థానిక కలెక్టరేట్ సమీపంలో గల జేసీవీపీ కార్యాలయంలో జమ్మలమడుగు అసెంబ్లీ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో జమ్మలమడుగు అసెంబ్లీ ఉపాధ్యక్షులు నరసింహులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

కడపఎర్రముక్కపల్లె, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని కడప ఎమ్మెల్యే మాధవి, టీడీపీపొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం కడప నగరం ద్వారకా నగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కడప నియోజకవర్గ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వారి సమస్యలను వివరించి అర్జీలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, పలువురు పాల్గొన్నారు.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు

కొండాపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తాళ్లప్రొద్దుటూరు ఎస్సై శివనాగిరెడ్డి తెలిపారు. మండ లంలోని ఎనమలచింతల గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో చీని తోటలు నరకడం వంటి చర్యలు మానుకోవాలని గ్రామస్థులకు సూచించారు. అనంతరం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు, సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బం ది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రార్థనలు

చాపాడు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవాలయం వద్ద శనివారం ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ప్రార్థనలు చేశారు. వంద ఏళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులరెడ్డి, ప్రసాద్ తదితరులు ప్రార్థనలు చేసినట్లు దేవస్థానం చైర్మన్ పెరుగు వీరనారాయణ పేర్కొన్నారు.









వెల్లాల దేవస్థానం అభివృద్ధికి దాతల తోడ్పాటు

రాజుపాలెం, అక్టోబర్ 11 (ఆంధ్ర జ్యోతి): వెల్లాల చెన్నకేశవ సంజీవరా యస్వామి దేవస్థానం పునర్నిర్మాణం లోభాగంగా అభివృద్ధికి భక్తులు స్వచ్ఛందంగా విరాళాలు అందిస్తున్నారు. అందులో భాగంగా శనివారం ప్రొద్దుటూరుకు చెందిన ఉండేలా భాస్కర్ రెడ్డి రూ.25వేలు, నంద్యాల జిల్లా బనగానపల్లెకు చెందిన ఎస్.భాస్కర్‌రెడ్డి రూ.20,116లు, బత్తులూరకు చెందిన మునగాల సంజీవరాయుడు 21వేలు, పాతకడప చెందిన సుబ్బమ్మ రూ.20వేలు, తోడే ళ్లపల్లెకు చెందిన గడ్డం వినాయకమ్మ 20,116లు, ప్రొద్దుటూరు చెందిన శ్రీనివాసులు 20,116, బత్తలేరుకు చెందిన 20,116 అందించారు. స్థానిక ఎమ్మెల్యేనంద్యాల వరదరాజు లరెడ్డి సహకారంతో దేవస్థానానికి రూ.3.55 కోట్లు మంజూరైంది. ఈనిధులకు టీజీఎఫ్ కింద రూ.85లక్షలు చెల్లించాల్సి ఉండగా ఇప్పటికే భక్తులు రూ.65లక్షలు అందించారు. ఆలయ నిర్మాణం ముఖ ద్వారానికి చేరుకుంది. ఇంకా విరాళాలు ఇచ్చే భక్తులు వారి పేర్లను చిరస్థాయిగా ఉండేట్లు శిలాఫలకం ముద్రిస్తామని ఆలయ కమిటీ తెలిపింది.



భక్తుల విరాళాలు తీసుకుంటున్న వెల్లాల దేవస్థానం చైర్మన్ నారాయణరెడ్డి

బీజేపీ పాలనపై ఆందోళన

● ఎంపీజే రాయలసీమ మహాసభల్లో వక్తలు

ప్రొద్దుటూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో దశాబ్దకాలానికి పైగా బీజేపీ పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థకు ఆత్మలాంటి రాజ్యాంగ పునాదులు పెకలించబడుతు న్నాయని ఏపీ సివిల్ రైట్స్ ప్రొటెక్షన్ రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) రాయలసీమ మహాసభలు ప్రొద్దుటూరులోని ఎస్ఆర్ ఫంక్షన్ హాలులో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గత పదేళ్లుగా కేంద్రంలోని ప్రజావ్యతిరేక పాలన చూసి న ప్రజలకు వాళ్లే మళ్లీ మళ్లీ వస్తారనే భావనతో ఈ దేశ ఎన్నికల వ్యవస్థపై, ఈవీఎంలపై నమ్మకం కోల్పోవడమేనన్నారు. ఎంపీజే రాష్ట్ర సుప్రీం కౌన్సిల్ కన్వీనర్ అబ్దుల్ ఖదీర్ మాట్లాడుతూ బీజేపీ ఆర్ఎస్ఎస్‌లు విషప్రచారం చేసి అధికారంలోకి వచ్చారన్నారు. వెల్ఫేర్ పార్టీ అధ్యక్షుడు సుభాన్ మాట్లాడుతూ నేడు సనాతనధర్మం కాదు, రాజ్యాంగ ధర్మం చెప్పినందుకు సుప్రీంకోర్టు సీజేఐపై బూట్లు విసిరారన్నారు. కార్యక్రమంలో జమాతే ఇస్లాం హింద్ రాష్ట్ర అధ్యక్షుడు రఫీ, ఏంపీజే రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రజాక్, రాయలసీమ ఇన్‌చార్జ్ అయూబ్‌ఖాన్, జిల్లా అధ్యక్షుడు జాకీర్, పట్టణ అధ్యక్షుడు హుస్సేన్‌బాషా, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రముఖ హైకోర్టు న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్

బాలిక విద్యను ప్రోత్సహించాలి

మైలవరం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బాలికల విద్యను ప్రోత్సహించాల్సినబాధ్యత అందరిపై ఉందని జమ్మలమడుగు ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ గౌషియాబీ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని హాస్టలులో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ మహేష్ పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతుల మహోత్సవాలు


మైలవరం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దొమ్మరనంద్యాల గ్రామంలో తొగటవీర క్షత్రియుల ఆరాధ్యదైవమైన చౌడేశ్వరీదేవి అమ్మవారి జ్యోతుల మహోత్సవాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి జ్యోతులను ఎత్తుకుని పురవీధుల గుండా నాట్యం చేస్తూ ఆనందోత్సాహాల మధ్య ఉదయం అమ్మవారి ఆలయం వద్దకు జ్యోతులను చేర్చారు. జ్యోతుల మహోత్సవాన్ని పురష్కరించుకుని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి చౌడేశ్వరీదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా నరసింహులు

మైలవరం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ కమిటీ అధ్యక్షునిగా పసిగాండ్ల పెద్ద నరసింహులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, జిల్లా ఎమ్మార్పీఎస్ అనుసంబంధ సంఘాల ఇన్‌చార్జి గుండాల ఈశ్వరయ్య ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. కల్లుట్ల గ్రామానికి చెందిన పెద్ద నరసింహులు అధ్యక్షునిగా, వేపరాల గ్రామానికి చెందిన ఓబయ్యను ఎంఎస్ఈ మహాజన పార్టీ అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. రాష్ట్ర నాయకుడు జంగాల మునిస్వామి, జిల్లా నాయకుడు నరసింహ మాదిగ, సుబ్బయ్య మాదిగ, నాగరాజు మాదిగ, శివరాం మాదిగను ఎన్నుకున్నారు.

ప్రజా ఉద్యమం పోస్టర్లు విడుదల


మైదుకూరు అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): వైసీపీ కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం పోస్టర్లను మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి శనివారం మైదుకూరులోని ఆవిష్కరించారు. పట్టణాధ్యక్షుడు లింగన్న,షరీఫ్,భరత్ తదితరులు పాల్గొన్నారు.












నరసింహుడికి పూజలు

బద్వేలు రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లెలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు















వర్షపు నీటితో పంటపొలాలకు తీవ్ర నష్టం



పొలాల్లో నీరు నిలబడి ఉన్న దృశ్యం

మైదుకూరు రూరల్,అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : కురుస్తున్న వర్షాలకు పంటపొలాల్లో నీరునిలిచి పంటలు దెబ్బతింటున్నాయని రైతన్నలు వాపోతున్నారు. చిన్నపాటి వర్షం పడినా పంట కాలువలు లేక నీరు బయటికి పోయే దారే లేక పంటలు కుళ్ళి పోతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైదుకూరు మండలంలో వనిపెంట సమీపంలోని చెర్లోపల్లెకు పోవు రహదారి వద్ద మురికి శ్రీరాములు, మురికి రమేష్, గోవిందమ్మ, రాము తదితర రైతులకు సంబందించిన సుమారు ఇరవై ఎకరాల పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచి బయటకు వెళ్లే కాలువలు లేక పంటలు కుళ్లి పోతున్నాయంటున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి ఉల్లి, పసుపు, అరటి పంటలను వేశామని. ప్రస్తుతం వర్షపు నీరు బయటకు వెళ్ల లేక పంటలు నాశనమవుతున్నాయన్నారు. అధికారులు పంట కాలువలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఉల్లి రైతులను ఆదుకోండి

- కోత దశకు చేరినా ఉల్లిగడ్డలకు గిట్టుబాటు ధరలేదంటూ ఆక్రందన
- తొలగింపులో జాప్యం జరిగితే గడ్డలు కుళ్లిపోతాయంటున్న రైతన్నలు
- ఎమ్మెల్యే సారూ..! మా గోడు పట్టించుకోవాలంటూ అన్నదాతల వేడుకోలు



మూడిండ్లపల్లెలో పొలంలో ఆరు రోజుల కిందట తొలగించిన పంట

దువ్వూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాలతో ఉల్లిరైతుల పరిస్థితి మూలిగే నక్కపైన తాడికాయ పడ్డట్టుగా మారింది. ఒక పక్క తోటల్లోనే ఉల్లిగడ్డలు నానిపోయి కుళ్లిపోవడానికి సిద్ధంగా ఉండగా మరో పక్క పండిన పంటకు గిట్టుబాటు ధరలేక ఏమిచేయాలో దిక్కుతోచక రోడ్ల వెంట, నీటి కాల్వల్లో ఉల్లిగడ్డలను పడవేసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుడు ఉల్లి ధరను చూసి ఈ యేడు ఉల్లిపంటను రైతులు ఎక్కువగా సాగుచేశారు. గతంలో కూడా ఉల్లిపంటకు వడిదుడుకులు ఎదురైన సంఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం ఉల్లిపంట చేతికొచ్చింది. పంట తీయాలంటే భయమేస్తుందని ఇప్పుడున్న ధరను చూసి ఇంటిల్లిపాదిని కంటతడి పెట్టిస్తోందని మైదుకూరు నియోజకవర్గ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని దువ్వూరు మండలంతోపాటు మైదుకూరు, చాపాడు, ఖాజీపేట, బ్రహ్మంగారిమఠం మండలాల్లో 4,845 ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశారు. ఎన్నో ఆశలతో అప్పులు చేసి పంట సాగుకు పూనుకున్నా తీరా పంట చేతికొచ్చే సరికి కొనుగోలుదారులు ముందుకు రాక తమ బాధ వర్ణణాతీతంగా మారిందని వాపోతున్నారు. ఎకరాకు ఇప్పటి వరకు రూ.60 వేలు దాకా పెట్టుబడుల కింద వెచ్చించామని ఇంకా పంట తొలగింపు, ఇతర ఖర్చులు చేతికొస్తాయని రైతులు పేర్కొంటున్నారు.

ఎమ్మెల్యే సారూ..! మమ్మలను ఆదుకోండి

మైదుకూరు నియోజకవర్గంలో ఉల్లిరైతులు గత కొద్దిరోజులుగా పడుతున్న బాధలను తట్టుకోలేక తమను ఎలాగైనా ఆదుకోవాలని స్థానిక ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను పత్రికాముఖంగా వేడుకుంటున్నారు. ప్రభుత్వ పరంగా మైదుకూరులో ఉల్లి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి వర్షాలతో నస్టాలబాటపడుతున్న తమకు చేయూత నందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కోట్లాది రూపాయలు దిగుబడులు పొలంలోనే మగ్గుతున్నాయని తిని తినక పిల్లలను సరిగా చదివించుకోలేక వ్యవసాయాన్నే నమ్ముకుని బ్రతుకుబండి లాగుతున్న మా రైతులకు దారిచూపుతారనే నమ్మకంతో ఉన్నామని వారు వేడుకుంటున్నారు. మరో ముఖ్య విషయం ఏమంటే పంట తీయడంలో తీవ్ర జాప్యం జరిగితే ఉల్లిగడ్డలు మోసులు రావడం, కుళ్ల సోకే అవకాశం ఉందంటున్నారు. కొందరు ఇప్పటికే ఉల్లిని పొలంలోనే వదిలివేయడం గడ్డలను పారబోయడం జరిగిందనే విషయాన్ని నియోజకవర్గ ఉల్లి రైతులు గుర్తు చేస్తున్నారు.

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి



తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వీఆర్‌ఏలు

జమ్మలమడుగు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని జమ్మలమడుగు డివిజన్ వీఆర్‌ఏల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆమేరకు శనివారం వారు సమావేశమై వీఆర్‌ఏల సమస్యలపై చర్చించారు. అనంతరం కార్యాలయం ఎదురుగా రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శులు గురుమోహన్, వెంకటపతి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం వీఆర్‌ఏలకు వేతనాలు పెంచాలని , పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు డివిజన్ అధ్యక్షుడిగా ఆర్.ప్రసాద, ఉపాధ్యక్షుడిగా బీ.సుబ్బరాయుడు, కార్యదర్శిగా కొండాపురం బాష, వర్కింగ్‌ప్రెసిడెంట్‌గా గండికోట ఖాజాహుస్సేన్, శాంతయ్య, చౌడమ్మ, ఆదిలక్ష్మి, జయరాజు, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు డివిజన్ పరిదిలోని వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

బస్సుల కోసం ప్రయాణికుల పడిగాపులు



జమ్మలమడుగు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో శనివారం బస్సులు సరిగాలేక సమయానికి రాక ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లుపడ్డారు.తాడిపత్రి, ఆళ్లగడ్డ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు దాదాపు 80 మందికిపైగా బస్సులు రాలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా స్త్రీశక్తి పథకానికి సంబంధించి ఎంతో మంది మహిళలు బస్సుల కోసం గంటల తరబడి రోడ్డుపై బస్సులకోసం నిలబడ్డారు. అలాగే జమ్మల మడుగు- ప్రొద్దుటూరు మార్గంలో బస్సులు పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇటీవల జమ్మలమడుగు ఆర్టీసీ డిపోకు చెందిన నేషనల్ మజ్దూర్ యూనిటీ కార్మికులు యూనియన్‌కు సంబందించిన నాయకులు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వద్ద డిపోలో ఉన్న సమస్యలకు సంబందించి ఏకరువు పెట్టారు. దీంతో జమ్మలమడుగు నుంచి తాడిపత్రి ఆళ్లగడ్డ, ప్రొద్దుటూరు, ముద్దనూరు వైపు బస్సులు పెంచాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించినా డిపోలో బస్సులు అంతంత మాత్రంగానే ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు తప్పడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

డీఎం ఏమన్నారంటే: ఈ సమస్యకు సంబందించి జమ్మలమడుగు ఆర్టీసీ డిపో మేనేజర్ సుబ్బమ్మను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా అన్ని రూట్లలో రెండవ శనివారం అయినా బస్సులను తగ్గించలేదని గతంలో లాగానే నడిచాయన్నారు. అయితే ఆళ్లగడ్డ రూటులో ఓ కండక్టరు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఇంటిలో బాగాలేదని వెళ్లిపోవడంతో మధ్యాహ్నం నుంచి బస్సుల సమస్య ఎక్కువగా ఉన్నట్లు ఆమె తెలిపారు.

శ్రీభాగ్ ఒప్పందాన్ని అమలు చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ అభివృద్ధికి శ్రీభాగ్ ఒప్పందం ఒక్కటే శరణ్యమని ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని అమలు చేయాలని రాయలసీమ రాష్ట్ర సమితి రాష్ట్ర అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. కడప, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు, అనంతపురం, ప్రకాశం, రాయచూరు, బళ్లారి, చిత్రదుర్గ్, వేలూరు, క్రిష్ణగిరి జిల్లాలను కలిపి ప్రత్యేక రాయలసీమను ఏర్పాటు చేయాలని కోరారు. శ్రీభాగ్ ఒప్పందం జరిగి 25 సంవత్సరాలు అయినా దానిని అమలు చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. నవంబరు 11న జరిగే సమావేశంలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధి పనులకు ఈకేవైసీ తప్పనిసరి

అట్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):అట్లూరు మండలంలోని ఉపాధి పనులకు వెళ్లాలన్నా ఉపాధి ద్వారా ఉద్యాన పంటలకు గోకులం షెడ్డు నిర్మించుకునేవారు ఆధార్ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏపీఓ జయచంద్ర శనివారం ప్రకటనలో తెలిపారు. ఆధార్ ఈకేవైసీ చేయించుకున్న వారికి మాత్రమే ఉపాధిపనులకు అర్హులని తెలిపారు.

ట్రైనీ ఎస్ఐగా జగదీశ్వర్‌రెడ్డి

దువ్వూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు పోలీసు స్టేషన్‌లో ట్రైనీ ఎస్ఐగా జగదీశ్వర్‌రెడ్డి విధులు నిర్వహిస్తున్నారు. ఈయన 2024-25 బ్యాచ్‌కు చెందిన వ్యక్తి. స్థానిక ఎస్ఐ వినోద్‌కుమార్ వద్ద ట్రైనీ ఎస్ఐగా ఇక్కడి స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ శిక్షణ పొందుతున్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

ఖాజీపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ సూపర్‌వైజర్ భారతి మాట్లాడుతూ బాలికలపట్ల అసమానతలు, వివక్షత, భద్రత లోపాలు వంటి సమస్యలను ఎదుర్కొనేందుకు ప్రతి విద్యార్థిని అవగాహన కలిగి ఉండాలని అన్నారు. బాలికల విద్య, వైద్య, పోషణ, రక్షణ వంటి హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రతి బాలిక సమాజంలో మార్పు కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

జమ్మలమడుగు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని డీవైఎఫ్ఐ పట్టణాధ్యక్షుడు యల్లయ్య, ఉపాధ్యక్షుడు సుబహాన్ డిమాండ్ చేశారు. శనివారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మోరగుడిలోని మూడు రోడ్ల కూడలి వద్ద దెబ్బతిన్న రోడ్లను పరిశీలించా రు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు.